క్లుప్తంగా

నేడు నూకాలమ్మ ఆలయ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన నూకాలమ్మ తల్లి ఆలయం

బాడంగి: మండలంలోని భీమవరం శివారు పొలంలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి నూతన ఆలయ ప్రతిష్ఠ బుధవారం నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. గతంలో ఉన్న ఆలయాన్ని తొలగించి కొత్తగా పునర్నించినట్టు తెలిపారు. ప్రతిష్ఠలో భాగంగా అమ్మవారి కర్ర బొమ్మలను గ్రామ పుర వీధుల్లో తిరువీధి మంగళవారం చేపట్టారు.

కిట్ల పంపిణీకి చర్యలు



మాట్లాడుతున్న ఎంఈవోలు

వంగర: పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు పి.ప్రవీణ్ కుమార్, కె.జగదీశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థి మిత్ర కిట్లను సరఫరా చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా బోర్ల మరమ్మతులు



బోరు మరమ్మతులు నిర్వహిస్తున్న మెకానిక్‌లు

రాజాం సిటీ: గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కంచరాం గ్రామంలో సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో బోర్లు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో బోర్లు మరమ్మతులకు గురైతే తమకు తెలియజేయాలని అన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

వంగర: మద్యం తాగి వాహనాలు నడిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. మంగళవారం మండల పరిధి మగ్గూరు, మద్దువలస జంక్షన్ల వద్ద వాహన తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలను వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల పరిధి అంతకాపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రికార్డుల నిర్వహణతో పాటు సర్వేలను శత శాతం పూర్తి చేయాలని అన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: డాక్టర్ యడ్ల నీరజారాణి గర్ల్స్ ఎస్ఎస్‌సీ 2025 అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నీరజారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 11న డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతి అందించనున్నామని అన్నారు. రాజాం నియోజకవర్గంతో పాటు తెర్లాం, మెరకముడిదాం, బలిజిపేట, పాలకొండ, జి.సిగడాం, బూర్జ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 540 పైబడి మార్కులు సాధించిన విద్యార్థినిలు అర్హులని అన్నారు. పరీక్షకు హాజరుకానున్న విద్యార్థినిలు వివరాలను మే 9లోగా 98859 78658 నంబరుకు వాట్సాప్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు వచ్చినప్పుడు మార్కుల జాబితా, హాల్‌టిక్కెట్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని అన్నారు. పరీక్ష అనంతరం అదే రోజు ఫలితాలు వెల్లడించి ప్రథమ బహుమతి రూ. 25వేలు, ద్వితీయ బహుమతి రూ. 15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు అందించనున్నామని పేర్కొన్నారు.

రానున్న ఖరీఫ్‌లో..
సాగునీటి కష్టాలు తప్పవా..!

- నియోజకవర్గంలో 230 పనులకు రూ.30 కోట్లతో సాగునీటి వనరుల ఆధునికీకరణకు ప్రతిపాదనలు
- మంజూరు మాత్రం ఉత్తిదే...
- 47,082 ఎకరాల ఆయకట్టు
- దశాబ్ద కాలంగా కళ్లెదుటే నీళ్లు.. తీరని సాగునీటి కష్టాలు
- శిథిలావస్థకు చరిన చెరువుల ప్రధాన మదుములు
- వ్యర్థాలతో నిండిపోయిన పంట కాల్వలు
- మదుములు బాగు చేయాలని కోరుతున్న అన్నదాతలు



మడకవాని చెరువు మదుము గోడ కూలిపోయి పూర్తిగా మూసుకుపోయిన నీరు విడుదలయ్యే రంధ్రం



శిథిలావస్థకు చేరిన వెంకయ్య బంద చెరువు మదుము

రామభద్రపురం: బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో వందలాది ఎకరాల ఆయకట్టు ఆధారమైన చెక్‌డ్యాంలు, సాగునీటి కాలువలు, పంట కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. దాదాపు దశాబ్ద కాలంగా వాటి నిర్వహణ ఊసే లేకుండా పోయింది. 2014 – 19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం నీరు చెట్టు పథకం కింద ఉపాధి హామీ నిధులతో కొన్ని చోట్ల మదుములు, చప్టాలు, చెక్‌డ్యాంల పనులు చేయకుండానే చేసినట్లు, మరి కొన్ని చోట్ల పనులు చేసినా నాసిరకంగా చేసి రూ.కోట్ల నిధులు అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ అధికాకులు గుర్తించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారులు పూర్తిగా పోయిన వాటికి ప్రతిపాదనలు పంపించినా అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. నియోజకవర్గంలో ఇరిగేషన్ అధికారులు 47,082 ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడేలా సాగునీటి వనరులైన చెక్ డ్యాంలు, మదుములు, సాగునీటి కాలువలు, చప్టాల మరమ్మతులు, ఆధునికీకరణకు రూ.30 కోట్ల అంచనా విలువలతో ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. ఆ ప్రతిపాదనలకు ఇప్పటికీ అతీగతి లేదు. అందుకు నిదర్శనం మండలంలోని మడకవాని చెరువు, వెంకటయ్య బందల మదుములు. వందలాది ఎకరాలకు ఆయకట్టు ఆధారమైన ఎకరాలకు సాగు నీరు అందించే చెరువుల మదుములు, పంట కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఏళ్లగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ ఏడాది సాగు నీటి కష్టాలు తప్పేటట్లు లేవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని పలు చెరువుల ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఖరీఫ్ సీజన్లో వర్షాలు పడి చెరువుల నిండినా చెరువులకు సంబంధించిన ఆయకట్టు పండేలా కనిపించడం లేదు.

మండల కేంద్రంలోని మండకవాని చెరువు ఆయకట్టు కింద పొలాలకు సాగు నీరందించే రెండు మదుములు పూర్తిగా శిథిలావస్థకు చేరి అధ్వానంగా మారిపోయాయి. మదుముల గోడలు పూర్తిగా పడిపోవడంతో పాటు వాటి ద్వారా నీరు వెళ్లే రంధ్రాలు పూర్తిగా పూడికపోయి పంట పొలాలకు సాగు నీరు అందే పరిస్థితి లేదు. కొన్నేళ్లుగా వీటి పరిస్థితి ఇలానే ఉండి పంట పొలాలకు నీరు వెళ్లే మార్గం లేకుండా పోయిందని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మడకవాని చెరువుకు గొలుసుకట్టు చెరువైన వెంకయ్యబంద తూములు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరి చెరువులో ఉన్న నీరు పంట పొలాలకు వెళ్లే పరిస్థితి లేక ఆయకట్టు రైతులు పూర్తిగా వరి సాగు వదిలేసి వర్షాధార పంటలు, ఆరు తడి పంటలైన కూరగాయలు, పత్తి సాగు చేసుకుంటున్నారు. రెండు చెరువుల పరిధిలో సుమారు 200 ఎకరాల ఆయకట్టు పొలం ఉంది. మదుముల దుస్థితి చూస్తే సాగునీరు సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. కూరాకులవాని చెరువులోని నీటిని చప్టా, మదుముల ద్వారా రామభద్రపురం గ్రామం సమీపంలో ఉన్న పంట పొలాలు మీదుగా మడకవాని చెరువుకు చేరుస్తూ నీటితో ఉండాల్సిన పంట కాల్వలు నేడు మురుగు కాల్వలను తలపిస్తున్నాయి. ఐదారు అడుగుల లోతులో ఉండాల్సిన సాగునీటి కాల్వలు వ్యర్థాలు, చెత్తాచెదారంతో పూర్తిగి నిండిపోయాయి. వ్యర్థాలతో పూర్తిగా పూడికపోయాయి. కనీసం నీటి చుక్క వెళ్లే మార్గం లేదు. కాల్వలు పూర్తిగా మూసుకుపోయి నీళ్లు వెళ్లేందుకు మార్గం లేకుండాపోయింది. ఇరిగేషన్, పంచాయతీ అధికారులు ఈ విషయమై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మదుములు బాగుచేయాలి



మడకవాని చెరువుకు సంబంధించి రెండు, వెంకయ్యబందకు సంబంధించి రెండు మదుములు పూర్తిగా కుంగిపోయి పాడైపోయాయి. ఎనిమిదేళ్లుగా సాగు నీటికి అవస్థలు పడుతున్నాం. చెరువుకు ఆధారంగా ఉన్న పంట కాలువలు పూర్తిగా తుప్పలు, డొంకలు, వ్యర్థాలతో పూడికపోయాయి. అధికారులు బాగు చేయకపోతే ఆయకట్టు పంట పొలాలకు సాగు నీరు అందే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన బాగు చేయించాలి.

– చొక్కాపు అప్పలనాయుడు, రైతు, రామభద్రపురం

ప్రతిపాదనలు పంపించాం..



రెండు చెరువుల మదుములు శిథిలావస్థకు చేరడం వాస్తవమే. మడకవాని చెరువు మదుములు ఆధునికీకరణకు రూ.8 లక్షలు, వెంటకయ్య బంద మదుము లు ఆధునికీకరణకు రూ.5 లక్షలు చొప్పున్న అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపించాం. పనులకు సంబంధించి నిధులు మంజూరు, అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

– హరికృష్ణ, ఇరిగేషన్ ఏఈ, రామభద్రపురం మండలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుప్పిలి సింహాచలం

తెర్లాం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగప్పవలస గ్రామం వద్ద మంగళవారం మోటార్ సైకిల్, లగేజి ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని తమ్మయ్యవలస గ్రామానికి చెందిన కుప్పిలి సింహాచలం అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై సింహాచలం వెళ్తుండగా రంగప్పవలసకు సమీపంలో రాజాం వైపు నుంచి వస్తున్న లగేజి ఆటో ఢీకొంది. సింహాచలం కుడికాలు విరిగిపోయింది. ఎడమ కాలికి, తలకు చిన్నచిన్న గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో ఆ వాహనంలో రాజాంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎస్ఐ సాగర్‌బాబు సిబ్బందితో వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గురైన వాహనాలను స్థానిక పోలీసుస్టేషన్ వద్దకు తీసుకువచ్చారు.

పహల్గాం మృతులకు నివాళులు

రాజాం: జమ్మూ కశ్మీర్‌లో ముష్కరుల చేతిలో హతమైన పహల్గాం మృతులకు రాజాం జీఎమ్ఆర్ వరలక్ష్మీ డీఏవీ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ జి.విజయ్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని కొవ్వొత్తులతో మంగళవారం నివాళులర్పించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దేశ రక్షణ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించాలని, పర్యాటకులపై దాడులు జరిపిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని నినదించారు.

సంక్షిప్తంగా...


గ్రంథాలయాల ఆవశ్యకతను గుర్తించాలి

తెర్లాం: గ్రంథాలయాల ఆవశ్యకతను విద్యార్థులు గుర్తించాలని తెర్లాం హైస్కూల్ హెచ్ఎం రమేష్, లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం గ్రంథాలయాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 6వరకు గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులంతా పాల్గొని అనేక విషయాలను నేర్చుకోవాలని సూచించారు.

పెన్షన్ల పంపిణీ సక్రమంగా జరగాలి

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సక్రమంగా జరిగేలా పంచాయతీ కార్యదర్శులంతా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రేగి రాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మే నెలకు సంబంధించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని, పెన్షన్ల పంపిణీ తనిఖీ చేయాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య నేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ పిల్లలకు కార్యకర్తలంతా ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి అన్నారు. పెరుమాళిలో మంగళవారం సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సెక్టార్ సమావేశానికి పీవో హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన అన్ని రికార్డులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రీస్కూల్ యాక్టివేషన్‌పై సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయండి

రామభద్రపురం: గ్రామాలలో బాల్య వివాహాల నివారణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రత్నం, సీడీపీవో రాజ్యలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సచివాలయ మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యాబోధన

బాడంగి: గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా విద్యార్థులకు ఆటపాటలు, నీతి కథలు చెప్పడం చదివించడం వంటి బోధన తరగతులు మంగళవారం జరిగాయి. వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ కోరారు.

లేబర్ కోడ్ చట్టాలతో కార్మికులకు నష్టం

రామభద్రపురం: లేబర్ కోడ్ చట్టాలతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆరికతోటలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి మంగళవారం మేడే పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆరికతోట సెక్టార్ లీడర్లు సత్యవతి, పి.కలావతి, పి.శాంతి, జి.రమణి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన కల్పించాలి

తెర్లాం: కిశోరి వికాసంపై గ్రామీణ ప్రాంతాల్లోని కిశోర్ బాలికలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని జగన్నాధవలస గ్రామంలో మండల స్థాయి శిక్షకులు(టీఓటీ)కు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి, టీఓటీలుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, వైద్య సిబ్బంది హాజరైయ్యారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

రాజాం: పట్టణంలో వైఎస్సార్ కూడలి వద్ద మానవత రాజాం సంఘం సభ్యులు మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. పట్టణానికి వచ్చే ప్రయాణికులు వేసవి తాపానికి గురికాకుండా ఉండేందుకు, వారి దాహార్తిని తీర్చేందుకు ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. చల్లని తాగునీటితో పాటు మజ్జిగను కూలింగ్ క్యాన్లు ద్వారా ఏర్పాటు చేశారు.

పనిచేయని ఏటీఎంలు

రాజాం: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏటీఎంల నిర్వాహకులు వాటి పనితీరు పర్యవేక్షణ పూర్తిగా వదిలేశారు. పట్టణంలో పాలకొండ రోడ్డులో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రెండు ఎస్‌బీఐ ఏటీఎంలు గత కొంత కాలంగా పని చేయడం లేదు. వీటిని ఇక్కడ ఏర్పాటు చేసి, నెలకు రూ.15 వేల మేర అద్దె చెల్లిస్తున్న యాజమాన్యం వాటి పని తీరుపై దృష్టి సారించలేదు. దీంతో ఖాతాదారులు అధికారుల తీరును తప్పుపడుతున్నారు. ప్రధానంగా రాజాం ఎస్‌బీఐ బ్రాంచి అధికారులకు ఈ సమస్యను వివరించినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

కూటమి నేతలు గొప్పలు

బాడంగి: గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు పొంది చనిపోయిన వారి స్థానంలో (స్పౌజ్) బదిలీ కానున్న వితంతు పింఛన్లను కొత్త పింఛన్లుగా కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యామలి శివప్రసాద్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి విమర్శించారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదని, ఇంకా అనర్హత పేరిట లక్షల పింఛన్లు రద్దు చేసిందన్నారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిరిమాను సంబరం



ఉద్దవోలులో జరిగిన శ్రీ వసంతాలమ్మ సిరిమానోత్సం (ఇన్‌సెట్‌లో) నందిగాంలో జరిగిన శ్రీపైడితల్లి అమ్మవారి సిరిమాను అధిరోహించిన పూజారి చౌదరి జనార్దనరావు

- ఉద్దవోలు, నందిగాం గ్రామాల్లో ఘనంగా సిరిమానోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- శ్రీపైడితల్లి, శ్రీవసంతాలమ్మలకు పూజలు చేసిన భక్తులు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు, నందిగాం గ్రామాల్లో మంగళవారం జరిగిన సిరిమానోత్సవం అంబరాన్ని తాకింది. ఉద్దవోలులో శ్రీ వసంతాలమ్మ, నందిగాంలో శ్రీ పైడితల్లి అమ్మవార్ల పండగలు సోమవారం నుంచి జరుగుతున్నాయి. ఆయా పండగల సందర్భంగా మంగళవారం సాయంత్రం రెండు గ్రామాల్లో సిరిమానోత్సవం జరిగింది. ఉద్దవోలులో గ్రామానికి చెందిన పూజారి ఉద్దవోలు సంగాం సిరిమానును అధిరోహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సిరిమానోత్సవాన్ని ఊరేగించారు. భక్తులు శ్రీ వసంతాలమ్మకు ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. నందిగాం గ్రామంలో శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా మంగళవారం జరిగిన సిరిమానును గ్రామ పూజారి చౌదరి జనార్ధనరావు అధిరోహించగా గ్రామంలోని పలు వీధుల్లో సిరిమానును ఊరేగించారు. సిరిమానోత్సవాన్ని నందిగాంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారి పూజలు చేశారు. ఉద్దవోలు, నందిగాం గ్రామాల్లో మంగళవారం జరిగిన సిరిమానోత్సవానికి బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేశ్వరరావు హాజరై అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

దయనీయంగా చెక్‌పోస్టు సిబ్బంది విధులు



రాత్రి సమయంలో లగేజీ పత్రాలు తనిఖీచేస్తున్న తనిఖీ కేంద్రం సిబ్బంది

రాజాం సిటీ: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఆదాయాన్ని తెచ్చే తనిఖీ కేంద్రం (చెక్‌పోస్టు)ల పరిస్థితి దయనీయంగా మారింది. స్థానిక పాలకొండ రోడ్డులోని చెక్‌పోస్టు సిబ్బంది ఆరుబయటే విధులు నిర్వహిస్తున్నారు. మార్కెట్ కమిటీకి చెందిన చెక్‌పోస్టుకు గతంలో ఇక్కడి భవన సదుపాయం ఉండేది. రోడ్డు విస్తరణలో భాగంగా దీన్ని తొలగించారు. అయితే చెక్‌పోస్టు సిబ్బంది తలదాచుకునేందుకు ప్రస్తుతం నిలువ నీడ కరువయ్యింది. కాలువ వెనుక భవనం నిర్మించాల్సి ఉండగా అదే స్థలంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో సిబ్బంది చేసేదేమీ లేక తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుబయట ఇదే చెక్‌పోస్టు అనే బోర్డు ఏర్పాటు చేసుకుని విధులు నిర్వహించాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ పక్కనున్న స్థలంలో చెక్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

తీసిన పూడిక మళ్లీ కాలువలోకే..



గట్టు వాలుపై వేసిన ఇసుక మళ్లీ కాలువలోకి చేరిక

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం నుంచి ప్రారంభమైన నారాయణపురం కుడి కాలువలో సిల్ట్ రిమూవల్ పనులు జరుగుతున్నాయి. ఈ కాలువలో ప్రారంభం నుంచి కొంత దూరం వరకు ఇసుకను గట్టుపై వేయకుండా కాలువలో గట్టు వాలుపై వేశారు. దీనితో సోమవారం కురిసిన అకాల వర్షానికి గట్టు వాలుపై ఉన్న ఇసుక అధిక మొత్తంలో ఇసుక దొర్లుకుంటూ మళ్లీ కాలువలోకి చేరింది. పనులు ఇలా కొనసాగితే ఖరీఫ్‌లో నీరు కిందకి ప్రవహించడం కష్టమని, ఇలా తూతూ మంత్రంగా పనులు చేస్తే చివరి ఆయకట్టుకు నీరు అందడం గగనమని రైతులు పేర్కొంటున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఉన్నత స్థాయి అధికారులు జరుగుతున్న పనులను పర్యవేక్షించి నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు. దీనిపై నారాయణపురం కుడి ప్రధాన కాలువ ఏఈఈ రాంబాబును సంప్రదించగా ఎంతవరకు ఇసుకను గట్టు వాలుపై వేశారో అంత దూరం వరకు ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకుని మళ్లీ అక్కడ సిల్ట్ రిమూవ్ చేసి, దిగువకు నీరు ప్రవహించేలా చూస్తామని తెలిపారు.

తక్షణం నిరుద్యోగ భృతి ఇవ్వాలి

- జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన ఏఐవైఎఫ్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామనీ, ఉద్యోగాలు వచ్చే వరకూ నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి 9 నెలలు కావస్తున్నా నేటికీ ఇవ్వకపోవడం దారుణమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మే 15 నుంచి నాలుగు రోజుల పాటు తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఈ మహాసభలలో తీర్మానం చేస్తామన్నారు. ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వి.రామకృష్ణ, ఎస్.వెంకటేష్, హేమంత్, పి.చిన్న, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడితల్లి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



పూజలందుకుంటున్న దాడితల్లి అమ్మవారు

బొబ్బిలి: పట్టణంలోని బైపాస్ రహదారిలో గల దాడితల్లి అమ్మవారికి మంగళవారం అమ్మవారికి ప్రియమైన రోజున ప్రత్యేక అలంకరణ, అర్చనలు చేశారు. అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన సుప్రభాత అర్చనకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కాగా మే నెల 4, 5, 6 తేదీల్లో దాడితల్లి జాతర జరగనుంది.

హెచ్‌ఎం మృతికి సంతాపం



ఈసర్ల రామారావు(ఫైల్)

రేగిడి: మండల పరిధిలోని కొర్లవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న ఈసర్ల రామారావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన వ్యక్తి రామారావు అని, ఈయన మృతి విద్యా రంగానికి తీరని లోటని ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.యరకయ్య, ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

నేడు నీటి సరఫరా నిలుపుదల



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈ వెంకట్

రాజాం సిటీ: మున్సిపాల్టీలోని అన్ని వార్డులకు ఈ నెల 30న నీటి సరఫరా నిలుపుదల చేయనున్నామని ఏఈ వెంకట్ మంగళవారం తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక పాలకొండ రోడ్డులోని చెక్ పోస్టు వద్ద మెయిన్ పైపులైన్ మార్చుతున్న కారణంగా ఈ అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ విషయాన్ని మున్సిపాల్టీలోని అన్ని వార్డుల ప్రజలు గమనించాలని కోరారు.